# మలుపు

-చిట్టిపెద్ది ఉమ

నాలుగురోజులు జరిగిన ఇన్స్యూరెన్స్ సెమినార్ ఆ రోజు మధ్యాహ్నం ముగిసింది. పుణె నుంచి హైదరాబాద్ వెళ్ళే ట్రైన్ రాత్రిదాకా లేదు. ఎక్కడైనా మంచి ఆంధ్రా భోజనం దొరికితే చూద్దామని మధుకర్, విజయ్, అపర్ణ, సమీరలతో బయట తిరుగుతున్నారు.

త్రిశాలలో మంచి తెలుగు భోజనం దొరుకుతుందని తెలిసింది. హోటల్ త్రిశాల పూర్తిగా వెజిటేరియన్ హోటల్. అదీ కాకుండా కందిపొడి, ఆవకాయలతోసహా నాలుక చుర్రుమనే కారాలతో భోజనం. నిజంగానే త్రిశాలలో భోజనం బాగుంది. విజయ్, సమీర నిదానంగా ఎంజాయ్ చేస్తూ తింటుంటే అపర్ణ, మధుకర్ చకచకా భోజనం ముగిస్తున్నారు.

"మేం కాసేపు అలా బయట షాపింగ్‌కి వెళ్ళి వస్తాం" మధుకర్, విజయ్, సమీరలవైపు చూస్తూ అన్నాడు.

'అదీ సంగతి' సమీర లోలోపల చిన్నగా నవ్వుకుంది. అపర్ణ, మధుకర్ ప్రేమికులు. వచ్చే నెలలోనే వాళ్ళ పెళ్లి.

"బై... అన్నీ సర్దేసుకున్నాం. అయినా కాస్త ముందుగానే వచ్చేస్తాం. కంగారుపడకండి. మేం బజారులో దిగి కారు పంపిస్తాం. ఓకే" అపర్ణ, మధుకర్ ఇద్దరూ వాళ్ళ జవాబు కోసం ఎదురు చూడకుండానే వెళ్లిపోయారు.

"వీళ్లిద్దరూ నిజంగానే షాపింగ్ చేస్తారంటారా?" విజయ్ కందిపొడి అన్నంలో కలుపుకుంటూ అన్నాడు.

"ఏమో నాకేం తెలుసు?" సమీర మొహం ఎర్రబడిపోయింది.

'ఛ... అలా అనకుండా ఉండాల్సింది. అందుకేగా వెళ్లారు అని అనాల్సింది' పక్కకి తిప్పుకున్న సమీర ఎర్రబడ్డ మొహాన్ని విజయ్ అబ్బురంగా చూసాడు. ఎంత అందంగా వుంది. పదేళ్ళల్లో సమీరలో ఏ మార్పూ లేదు. అదే లావణ్యం, అదే నునుపు, అదే మెరుపు, అవే ఒంపులు. పెళ్లయినందుకు, పదేళ్ళు పెరిగినందుకు గుర్తుగా చూపువాసి లావెక్కింది అంతే.

"మీరు ఒప్పుకుంటే, అభ్యంతరం లేకపోతే నా రూమ్‌కి వస్తారా. ఈ మూడుగంటలు సరదాగా గడపొచ్చు"

సమీర పెరుగన్నం కెలుకుతోంది. సమీర మనస్సు పదేళ్ళు వెనక్కి వెళ్లింది.

"ఇక్కడే నా రూమ్. వస్తారా. కాసేపు సరదాగా గడుపుదాం" సరిగ్గా పదేళ్ళక్రితం విజయ్ అచ్చం ఇలాగే అడిగాడు. దాని పర్యవసానం మటుకు...

***

గుంటూరు నుంచి విజయవాడ వెళ్ళే బస్సెక్కింది సమీర. బస్‌లో ఒక్కటే సీట్ ఖాళీగా వుంది. సీట్లో కూర్చుంటూ పక్క సీటువైపు చూసింది. పుస్తకం చదువుకుంటున్నాడు అతను. ఉంగరాల జుట్టు, చక్కటి ఛాయ... అబ్బ ఎంత బాగున్నాడో! బస్సు కుదుపుల్లో, వానాకాలంలో కొత్తగా ఏర్పడ్డ గుంటల్లోంచి పైకి కిందకి కుదేస్తుంటే ఎంత జాగ్రత్తగా ఒదిగి కూర్చున్నా సమీర ఒళ్ళు అతనికి తగులుతోంది. 'ఎవరో ఈ అమ్మాయి... ఎంత అందంగా వుందో' పుస్తకంలోంచి ఓరగా సమీరవైపు చూస్తున్న విజయ్ మనస్సు పదే పదే సమీరవైపు లాగుతోంది. కవులు వర్ణించిన అందం. నల్లటి పొడవైన జడ, ఆపిల్ పండు రంగులో పొంగిన బుగ్గలు, లిప్‌స్టిక్ వేసుకున్నంత ఎర్రగా వున్న పెదాలు, సరైన ఎత్తు, లావుతో ఎంతో నేర్పుగా చెక్కిన పాలరాతి శిల్పంలా వున్న ఈ అమ్మాయి పేరేమిటో?

"హలో...మీ పేరు?"

"సమీర.." నవ్వుతూ జవాబిచ్చింది.

"గుంటూరులో ఎమ్మెస్సీ ఫైనల్ చదువుతున్నాను. నాన్నగారు ఎందుకో రమ్మంటే ఇంటికి వెళ్తున్నాను"

"నా పేరు విజయ్. ఎల్ఐసిలో ఆఫీసర్‌గా చేస్తున్నాను విజయవాడలో. కజిన్ పెళ్లికి నెల్లూరు వెళ్లి వస్తున్నాను" విజయ్ తన గురించి చెప్పుకున్నాడు. కాసేపు కాలేజీ వాతావరణం గురించి, డేటుడే పాలిటిక్స్ గురించి మాట్లాడుకున్నారు. సాధారణంగా బస్‌లో, ట్రైన్‌లో తోటి ప్రయాణికులతో ఎక్కువగా మాట్లాడని సమీర తను అతనితో అంతలా నవ్వుతూ మాట్లాడడం ఆశ్చర్యంగా ఉంది. అతని అందం, రూపం తనని కాల్చేస్తున్నాయని సమీర ఒప్పుకోకుండా ఉండలేకపోయింది. విజయ్ కూడా అలాంటి పరిస్థితిలోనే ఉన్నాడు. తనంతట తానుగా ఏ అమ్మాయినీ ఇంతవరకూ పలకరించలేదు. అదీ బస్సులో అమ్మాయిని చూసి మొదటిసారి తన మనస్సు చలించింది. బస్ కుదుపులు ఒకళ్లని ఇంకొకళ్లమీదకి పడేస్తుంటే ఇదివరకట్లా తిట్టుకోకుండా ఏదో తెలియని మాధుర్యాన్ని అనుభవిస్తోంది సమీర. 'తప్పు... ఛీ...ఛీ... తన మనస్సు, శరీరం ఇలా అదుపు తప్పుతున్నాయి ఏమిటి? ఇదివరకెప్పుడూ ఇలాంటి పరిస్థితి రానివ్వలేదు. గట్టిగా రాడ్ పట్టుకుని కూర్చుంటే ఎంత పెద్ద కుదుపైనా శరీరం అదుపులో వుంచుకోవచ్చు' కావాలనే ఎక్కువగా ఒరిగిపోతోంది అతనివైపు. సమీర ఎత్తయిన ఒంపులు, మెత్తని శరీరం పక్కలకి తగులుతుంటే విజయ్‌కి గమ్మత్తుగా, హాయిగా వుంది. ఎంతమంది ఆడవాళ్లని చూసినా కలగని ఏదో భావం, తపన, ఏదో కావాలన్న కోరిక. కాస్త ఏమాత్రం తను ప్రొసీడ్ అవుతున్నాడని తెలిసినా ఈ పిల్ల అరచి గోల చేస్తుందన్న భయం. కానీ ఎందుకో ఆ అమ్మాయి తనంటే చాలా ఇష్టపడుతోందనిపించింది విజయ్‌కి. మరి తను హీరోలా వుంటాడు. తను కూడా సమీరపట్ల ఆకర్షింపబడ్డాడు. బస్ విజయవాడలో ఆగగానే అందరూ బస్ దిగారు.

"మీరు ఎక్కడికి వెళ్లాలి?"

"నేను గన్నవరం వెళ్తున్నాను. ఇంకో అరగంటలో బస్ వుంది" సమీర అంది.

గంట ప్రయాణంలో చాలా మాట్లాడుకున్నారు. చనువు కూడా గంట ప్రయాణంలో ఏర్పడే వాళ్ల మధ్య కంటే ఎక్కువగానే ఏర్పడింది.

"మిమ్మల్ని బస్ ఎక్కించి వెళ్తాను. నా రూమ్ ఇక్కడే. కాసేపు హోటల్‌కి వెళ్లి కాఫీ తాగుతూ మాట్లాడుకుందామా?" విజయ్ అడగ్గానే సమీర తలూపేసింది. విజయ్ బస్టాండ్‌కి కొంచెం దూరంలో వున్న సవేరా లగ్జరీ హోటల్‌కి తీసుకెళ్లాడు. మసాలా దోసె, కాఫీ ఆర్డరిచ్చి కబుర్లలో పడ్డారు మళ్ళీ. సమీర తన ప్రవర్తనకి తనే ఆశ్చర్యపోతోంది లోలోపల. కాలేజీలో తన వెంట ఎంతోమంది పడతారు. చనువు పెంచుకోవాలని చూస్తారు. క్యాంటీన్‌కి పిలుస్తారు. అయినా తనెప్పుడూ ఎవరితో వెళ్లలేదు. ఏదో సాకుతో సున్నితంగా తప్పించుకుంటుంది. డిగ్రీలో వుండగానే ఎంతోమంది

అమ్మాయిలు బోయ్‌ఫ్రెండ్స్‌తో తిరిగేవారు ఏమాత్రం సంకోచం లేకుండా. ఇంక ఇప్పుడు యూనివర్శిటీ అమ్మాయిలయితే చెప్పనే అక్కర్లేదు. బోయ్‌ఫ్రెండ్స్ లేని అమ్మాయిల్ని వేళ్లమీద లెక్క పెట్టవచ్చు. హాస్టల్‌లో వున్న అమ్మాయిలు అడ్డూ అదుపూ లేకుండా ఫ్రెండ్స్‌తో తిరిగేసి కొంప మునిగితే ఓరోజు హాస్పిటల్‌లో పడుకుని సైలెంట్‌గా హాస్టల్‌కి వచ్చేయడం తనకి తెలుసు. తనని చాలా మంది వెక్కిరిస్తుంటారు కూడా. కాలేజీ లైఫ్ ఎంజాయ్ చేయడం చేతకాదంటూ. ఎంజాయ్ అనే పదానికి వాళ్లిచ్చే అర్థం వేరు. తన అర్థంవేరు. తనకెప్పుడూ అలా ఎంజాయ్ చేయాలనిపించలేదు మరి.


"సమీరా! మీరు...మీరు ఒప్పుకుంటే నా రూమ్‌కి వస్తే ఓ గంట సరదాగా గడుపుదాం. ఎనిమిదింటికి మిమ్మల్ని బస్ ఎక్కిస్తాను'' విజయ్ భయపడుతూనే అడిగాడు.

సమీర గుండె ఓ క్షణం లయ తప్పింది. ఒక్కసారి ఆ అనుభవం... అదీ మనస్సుకి మరీ ఇంతలా నచ్చినవాడితో... ఒక్కసారి ఎవరికీ తెలియదు. ఫర్వాలేదు. ఇంట్లో వాళ్లకి తను ఈ బస్‌లో వస్తున్నట్లు తెలియదు. ఎనిమిదింటికి కాకపోతే పదింటి బస్‌కి కూడా వెళ్లవచ్చు. ఊళ్ళో బస్టాండ్ వెనుకే రాములు టీ దుకాణం. నూకాలు తనింట్లో పనిమనిషి. పిలిస్తే ఇద్దరూ తోడు వచ్చి ఇంట్లో దిగబెడతారు. అదీ ఇబ్బంది కాదు. ఎలా తలాడించిందో సమీరకే తెలియదు.

"మీ రూమ్ అడ్రస్ రాసివ్వండి. నేను మీ వెనుకే వేరే ఆటోలో వస్తాను. ఇద్దరం ఒకే ఆటోలో వెళ్తే ఎవ్వరైనా గమనించే అవకాశం వుంది'' సమీర ఆలోచన విజయ్‌కీ నచ్చింది.

ఇద్దరూ బయటకొచ్చి చెరో ఆటో ఎక్కారు. రెండు ఆటోలు ఒకదాని వెనుక మరొకటి వంద గజాల దూరంలో వెళ్తున్నాయి. కొంచెం దూరం వెళ్లాక విజయ్ ఆటో క్రాస్ చేయగానే రెడ్ సిగ్నల్ పడింది. ఆ రెండునిముషాలు సమీర రెడ్‌సిగ్నల్‌ని చూస్తూ ఆలోచనలో పడింది. రెడ్‌సిగ్నల్ ఆటోనే కాదు, ఆటోలోవున్న తననీ హెచ్చరిస్తోంది హద్దు దాటవద్దని. తనేం చేస్తోంది? ఎవరో ముక్కూ మొహం తెలియని మనిషితో... ఎంత అందగాడైతే మాత్రం కాలేజీలో ఎంతమంది అందగాళ్ళు తన





## విమర్శ ఇలా ఉండాలి

ప్రతి పత్రికా సినిమాలకి విశేష ప్రాధాన్యం ఇస్తుంది. ఎప్పటికప్పుడు సినిమా విశేషాలు అందజేస్తూ కలర్‌ఫుల్ ఫొటోగ్రాఫ్స్‌తో పాఠకులకు కనువిందుచేస్తుంటాయి. హీరో షారూక్ ఈమధ్య పత్రికల్లో వస్తున్న సినిమా కాలమ్స్ గురించి మాట్లాడుతూ– 'కొంత మంది సినీ కాలమిస్టులు తమ ఇష్టాయిష్టాల్ని తమ విమర్శల్లో చొప్పిస్తారు. కాలమిస్టులు ప్రజలకు వాస్తవాలు చెప్పాలి గానీ హావభావాలు కాదు. హీరోలతో గానీ, దర్శక, నిర్మాతలతో గానీ ఏమైనా విభేదాలుంటే సామరస్యంగా పరిష్కరించు కోవాలి. అంతేగానీ ఏదో ఓ సినిమా గురించో, ఓ హీరో, హీరోయిన్‌కి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సముచితం కాదు' అంటున్నాడు షారూక్. 'ఆంటోనీ లేన్ రాసిన సినీ విమర్శా గ్రంథాలు చాలా బాగుంటాయి. నిర్మాణాత్మక విమర్శ అంటే ఏంటో అది చూసి మన కాలమిస్టులు నేర్చుకుంటే బాగుంటుంది' అని సలహా కూడా ఇస్తున్నాడు.

వెనుక పడలేదు. ఎప్పుడూ లేనిది బుద్ధి ఇలా వక్రించిందేమిటి? ఇతను రూమ్‌లో ఒక్కడే ఉంటాడో... తెలియదు. ఇతని తరువాత ఇంకో నలుగురు తన మీద పడి నలిపితే... సమీరకు సినిమాల్లో చూపించే గ్రూప్ రేప్ సీను గుర్తుకొచ్చి వణికిపోయింది. చేతిలోవున్న విజయ్ అడ్రస్ కాగితం నలిపి పడేసి ఆటోని బస్టాండ్‌వైపు తిప్పమంది.

★★★

"అమ్మా! నాకీ సంబంధం వద్దు. నాకు నచ్చలేదు" విజయ్ మాటలకి విస్తుపోతూ చూసారు రామ్మోహన్, కామాక్షి.

"పిల్ల రంభలా వుంది. మంచి కుటుంబం, ఇంకేం కావాలిరా! జాతకం చాలా నప్పింది కూడాను"

"ప్లీజ్! నాకెందుకో నచ్చలేదు. అంతే" విజయ్ బయటకెళ్ళిపోయాడు విసురుగా.

మూడురోజుల తరువాత విజయ్, సమీర పెళ్లి చూపుల్లో ఒకళ్లనొకళ్ళు చూసుకుని తేలుకుట్టిన దొంగల్లా అయిపోయారు. ఇద్దరి మొహాలు వాడిపోయాయి.

"మా రోజుల్లో...ఎవర్ని తెస్తే వాళ్ళముందు తల వంచి ముడేయించుకునేవాళ్ళం. ఇలాంటివన్నీ ఎరగమమ్మా" అంది బామ్మ.

"ఎరక్కపోతే ఇప్పుడు తెలుసుకో" సమీర బామ్మవైపుకొరకొరా చూస్తూ అంది.

"సమీరా! ఇంకోసారి ఆలోచించు. అబ్బాయి అందగాడు. మంచి ఉద్యోగం. మంచి కుటుంబం. జాతకాలు బాగా నప్పాయి కూడాను"

సమీర తల్లిదండ్రులకి ఆమె నిర్ణయం చాలా కష్టంగా వుంది. సమీర ఎందుకంత మొండిగా వద్దంటోందో అర్థం కాకుండా దిగులు పడ్డారు. 'తనని పిలిచినట్లు ఇతగాడు ఎన్ని ప్రయాణాల్లో ఎంత మందిని పిలిచి విందులు చేసుకుని వుంటాడో' అని సమీర ఆలోచిస్తే, 'ముక్కూమొహం తెలీని, ఓ గంట పరిచయస్తుడు తనతోటే రావడానికి ఒప్పుకుంది. ఇంత అందగత్తె... నిశ్చయంగా కాలేజీలో గ్రంథం నడిపే వుంటుంది' అని అనుకున్నాడు విజయ్.

★★★

పదేళ్ల తరువాత అనుకోకుండా ఒకే చోట పనిచేస్తూ తారసపడ్డారు విజయ్, సమీర. ఇద్దరూ ఒకేలాంటి పరిస్థితుల్లో వున్నారని తెలిసి ఆశ్చర్యపోవాలో, బాధపడాలో అర్థంకాక నవ్వుకున్నారు.

విజయ్ భార్య గీత వట్టి అనుమానం మనిషి. అందగాడైన మొగుడు ఎక్కడ దూరమైపోతాడో అన్న భయంతో అనుమానంతో అతని జీవితాన్ని నరకం చేస్తోంది. సమీర భర్త అనూజ్ అదే టైప్. సమీర డబ్బు నెలనెలా తేవడం బావుంటుందికానీ ఆఫీస్‌లో ఏం చేస్తుందో, ఎవరితో ఎలా ప్రవర్తిస్తుందో అని ఒకటే అనుమానం. ఒకే ఆఫీసులో పని చేస్తుండడంతో సమీర, విజయ్ సహజంగానే ఫ్రెండ్స య్యారు. అందులో ఇద్దరికీ ఎదుటివాళ్ల జీవితాలు ఎలా వున్నాయో తెలిసాక ఆ తరువాత ఎన్నోసార్లు అరమరికలు లేకుండా మాట్లాడుకున్నారు. విజయ్ మొదటిసారి తాను అలా ఓ అమ్మాయిని అంత ధైర్యంగా ఆహ్వానించానని వాపోతే, సమీర విజయ్ మాటలకి ఊ కొట్టి తన దృష్టిలోనే తను పడిపోయానని ఆక్రోశించింది. బస్ ప్రయాణం ముందు, తరువాత కూడా ఇద్దరూ కల్మషం లేనివాళ్ళేకానీ ఆ బస్ ప్రయాణం తమని పెళ్లిచూపుల్లో శాశ్వతంగా కలిసి వుండే అవకాశం వచ్చినా అపోహలతో ఆమడ దూరం చేసిందని తెల్సుకుని కృంగిపోయారు. 'దైవ లీల, విధివిలాసం, నుదుటిగీత' అంటే ఇదేనేమో. తమ రాతని తామే వంకర చేసుకున్నారు.

"సమీరా! కారు వచ్చింది. రూమ్‌కి వెళ్దామా?"

సమీర ఉలిక్కిపడి హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని విజయ్ వెనకాలే నడిచింది. సమీరకి, అపర్ణకీ ఒక గది, విజయ్, మధుకర్‌లకి ఒక గది ఒకే హోటల్లో ఇచ్చారు. సమీర హృదయం అంతా అల్లకల్లోలంగా వుంది. 'విజయ్ ప్రతిపాదనకి ఈసారి తలూపాలా? నో అనాలా?' మొదటిసారి బస్ ప్రయాణం ఓ మలుపు అయితే, ఈ పుణె ప్రయాణం తమ జీవితంలో రెండో మలుపు. ఆ మలుపు కేవలం తెగింపు చూపించినందుకు ముగింపుగా ఇద్దరూ అపోహలతో తాత్కాలిక ఆనందాన్ని పొందలేరు. పైగా శాశ్వతంగా ఒకరినొకరు పోగొట్టుకున్నారు. ఈసారి తాము తెగిస్తే... ఏమవుతుంది? అప్పుడు తప్పు చేయకుండానే ఇద్దరూ శిక్ష అనుభవించాం. అనుభవిస్తున్నాం. ఇంకా... ఇప్పుడు తనకి ఇద్దరు ఆడపిల్లలు. విజయ్‌కీ ఇద్దరు ఆడపిల్లలు. తప్పు చేయనప్పుడే, చేయాలన్న ఊహ వచ్చినందుకే శిక్ష పడితే... ఇప్పుడు తప్పు చేస్తే ఏం శిక్ష పడుతుంది? అదీ ఎంతమందికి?

"దిగండి హోటల్ వచ్చేసింది"

సమీర నాలుగువైపులా చూసి తన పరధ్యానానికి తిట్టుకుంటూ కారు దిగింది. విజయ్ రిసెప్షన్‌లో ఏదో చెప్పి మెట్లెక్కుతున్న సమీరని కలుసుకున్నాడు. కారిడార్‌లో అడుగుపెట్టిన సమీర ఒక్క క్షణం ఆగింది. కారిడార్‌కు అటువైపు సమీర రూమ్, ఇటువైపు విజయ్ రూమ్.

"బై విజయ్!" అంది స్థిరంగా తన గదివైపు అడుగువేస్తూ.

★

